క్లుప్తంగా

ప్రణాళికా బద్ధంగా చదివితే ఉత్తీర్ణత



విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్ఎం అనురాధ

కె.కోటపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న ప్రతి విద్యార్థి ప్రణాళికా బద్ధంగా చదవాలని ఎ.కోడూరు హైస్కూల్ హెచ్ఎం అనురాధ తెలిపారు. ఎ.కోడూరు సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ 36 మంది విద్యార్థులు 25 రోజులపాటు ఏకాగ్రత, పట్టుదలతో చదవాలని సూచించారు. ఒత్తిడికి గురికాకుండా మానసిక ప్రశాంతతో పరీక్షలను రాయడం వల్ల మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. సమీకృత వసతి గృహాధికారులు పి.గంగునాయుడు, రమేష్, ఉపాధ్యాయులు మాధవి, బేగం, గోవింద్, పీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

21న కొత్త అమావాస్య జాతర



కమిటీ సమావేశంలో సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం: పట్టణంలో నూకాలమ్మ జాతరకు తగిన ఏర్పాట్లు చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసి పాత్రుడు తెలిపారు. అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ ధనిమిరెడ్డి నాగు అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15, 17, 20 తేదీల్లో అమ్మ జాగరణ ఉంటుందన్నారు. 21న కొత్త అమావాస్య పండగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, ఆలయ కార్యనిర్వాహణాధికారి సాంబశివ రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

గొలుగొండ: పాకలపాడులో అర్హత కలిగిన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించలేదని ఇచ్చిన ఫిర్యాదులపై అనకాపల్లి ఆర్డీవో చిన్నకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఏడుగురు పట్టభద్రుల నుంచి వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు సేకరించి న్యాయం చేస్తామని ఆర్డీవో తెలిపారు. తహసీల్దార్ ఆనందరావు నుంచి వివరాలు సేకరించారు.

ఘనంగా దారాలమ్మ తల్లి పండగ



అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నాతవరం: దారాలమ్మ తల్లి పండగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం వేకువ జాము నుంచే నాతవరం, వల్సంపేట పంచాయతీలకు చెందిన భక్తులు అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. పసుపు కుంకుమ, చీర జాకెట్టు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారి పండగ ఘనంగా జరుపుకుంటే పంట దిగుబడులు బాగుంటాయని ఈప్రాంతీయులకు అపారమైన నమ్మకం. ఈ సందర్భంగా కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, మాజీ సర్పంచ్ శెట్టి శ్రీను, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, వర్తక సంఘం అధ్యక్షుడు తూతిన నాగేశ్వరరావు, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతిభక్తి.. వనితా శక్తి



మాడుగుల: అనురాధను సత్కరిస్తున్న ఎంపీటీసీలు విజయలక్ష్మి, మహేశ్వరి



చోడవరం ప్రేమ సమాజంలో మాట్లాడుతున్న పూర్వ వీసీ ముర్రు ముత్యాలనాయుడు



బుచ్చెయ్యపేట: ఎంపీపీ నాగేశ్వరిదేవిని సత్కరిస్తున్న నాయకులు

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు ఘన సన్మానం

అలసటలేని ఆరాటం.. సమాజంలో అస్తిత్వానికి నిరంతర పోరాటం.. పురుషాధిక్య ప్రపంచంలోని ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని అసమాన ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన స్ఫూర్తి కెరటం.. వివిధ రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న అతివలు మహిళా దినోత్సవం సందర్భంగా ఘన సత్కారాలు అందుకున్నారు.

చోడవరం: మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనం నిర్వహించారు. వివిధ విభాగాల్లో రాణిస్తున్న మహిళా ఉద్యోగులను, ప్రజాప్రతినిధులను ఈ సందర్భంగా సత్కరించారు. స్థానిక ప్రేమ సమాజంలో విశ్వశాంతి మహిళా మ్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ వీసీ ముర్రు ముత్యాలనాయుడు మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను వినియోగించుకుని మహిళలు మరింతగా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. స్వయం ఉపాధి కల్పనతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వాల తోడ్పాటును విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్క్ ప్రసాద్, ప్రేమ సమాజం మేనేజర్ ప్రసాద్‌రాజు, మ్యాక్స్ అధ్యక్షురాలు కోరుకొండ లక్ష్మి, ఏజేకేర్ ఫౌండేషన్ ప్రతినిధి సుప్రజ, సీపీఐ డివిజన్ కార్యదర్శి అప్పలరాజు పాల్గొన్నారు. చోడవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి కాసు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని విభాగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. వైస్ ఎంపీపీ బైన కుమారి, పంచాయతీ విస్తరణాధికారి చైతన్య, సూపరింటెండెంట్ అమ్మాజీ, చోడవరం సర్పంచ్ బండి నూకాలమ్మ పాల్గొన్నారు.

మాడుగుల: జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధను ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు జిల్లాలో మహిళల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా, వార్డు మెంబర్లు శీలా మంతులు జ్యోతి పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్‌కు సత్కారం

చోడవరం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం బెన్నవోలు గ్రామానికి చెందిన డీసీసీబీ డైరెక్టర్ మూడెడ్ల మహాలక్ష్మిని సత్కరించారు. విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, సహచర మహిళలు సత్కరించి అభినందనలు తెలిపారు. జన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మహాలక్ష్మి, బెన్నవోలు సర్పంచ్ శంకరరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తెలిపారు. బుధవారం వడ్డాదిలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీలను సన్మానించారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుచ్చెయ్యపేటలో మహిళలు మానవ హారంగా ఏర్పడ్డారు. తహసీల్దార్ అంబేడ్కర్, ఏపీవో మురళి, ఏపీఎం బాలరాజు, నాయకులు కుంచం ప్రకాష్‌రావు, బోయిన నారాయణమూర్తి, యలమర్తి వాసు, ముసలినాయుడు, నాయుడు, రాజు పాల్గొన్నారు. పి. భీమవరంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు గాడి బాలు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు.

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ కేక్ కట్ చేసి సహచర మహిళలకు తినిపించారు. మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్న సీఎం జగన్‌కు, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: సర్పంచ్ జామి రమణబాబు ఆధ్వర్యంలో కె.జె.పురంలో ఉప సర్పంచ్ కాళ్ల కోటమ్మ, వార్డు సభ్యురాలు ఆడారి నాగలక్ష్మి, సూరిశెట్టి పైడితల్లమ్మలను ఘనంగా సన్మానించారు.

గొలుగొండ: స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మంగ మాట్లాడుతూ మహిళలకు హక్కులు, బాధ్యతలు గురించి వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని తెలిపారు. వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నాతవరం: ఏపీఎం మర్రి లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయలక్ష్మిల ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాకా సంఘాల మహిళలు ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించారు, నాతవరం, గునుపూడి పీహెచ్‌సీలతోపాటు హైస్కూళ్లలో ఈ వేడుకలు నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాడుగుల రూరల్: కె.జె.పురంలె ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం



చోడవరం రూరల్: మహిళా డైరెక్టర్ మహాలక్ష్మికి సత్కారం



బుచ్చెయ్యపేట: మానవహారంగా ఏర్పడిన మహిళలు



నాతవరం: మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



విజేతలతో ఎమ్మెల్యే గణేష్, డీసీసీబీ చైర్‌పర్సన్ అనిత



క్యాట్ వాక్‌లో పాల్గొన్న పరిపూర్ణ మహిళలు

నర్సీపట్నం: మహిళా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక సిటీ క్లబ్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా పక్షపాతిగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పించారన్నారు. మహిళల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఎల్ఐసీ ఫెడరేషన్ నెల రోజుల పాటు పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడు దేవాత సత్యనారాయణ, ఆర్గనైజర్, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం పరిపూర్ణ వనిత, స్టార్ మహిళా పోటీలను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 చొప్పున విజేతలకు ప్రదానం చేశారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు



సుందరంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణ

రోలుగుంట: డీపీవో శిరీషారాణి ఆదేశాల మేరకు గ్రామ వీధులు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం సందర్శించినామె ఇక్కడ ఆవరణలో తుప్పలు, చెత్తా చెదారాలు ఉండటంతో పంచాయతీ కార్యదర్శుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా ఉంటే రోగాలు రావా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బుధవారం మండల పరిషత్ ఆవరణలో పరిశుభ్రం చేశారు. ఈ పనులను ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు పర్యవేక్షించారు.

సుధాకర్ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



కార్యక్రమానికి హాజరైన పాల సొసైటీల అధ్యక్షులు, కార్యదర్శులు



మాడుగుల: జాలంపల్లిలో ఓటు వేయాలని కోరుతున్న వైస్ ఎంపీపీ రాజారామ్, తదితరులు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. స్థానిక కల్యాణ మండపంలో వివిధ గ్రామాలకు చెందిన విశాఖ డెయిరీ పాల సొసైటీల అధ్యక్షులు, కార్యదర్శులు, సిబ్బందితో బుధవారం ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ రాజధాని కానున్న తరుణంలో ఈ గెలుపు అత్యంత అవశ్యమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికతోపాటు రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు పట్టభద్రులను అభ్యర్థించారు. పార్టీ నాయకులతో కలిసి బ్యాంక్‌లు, ప్రభుత్వ పాఠశాలలు, పోస్టాఫీస్ ఉద్యోగులను కోరారు. బ్యాలెట్ నమూనా పత్రం అందించి మొదటి ప్రాధాన్యత ఓటు సుధాకర్ వేయాలని అభ్యర్థించారు. విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్‌బాబు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో విస్తృత ప్రచారం

దేవరాపల్లి: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మద్దతుగా దేవరాపల్లి, రైవాడతోపాటు చింతలపూడి, తామరబ్బ, వాలాబు గిరిజన పంచాయతీల్లో జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పార్టీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, చల్లా నాయుడు, రెడ్డి సూర్యనారాయణ, సోమిరెడ్డి సన్నిబాబు, గొర్రుపోటు సుధారాణి, టోకురి రామకృష్ణ, దొమ్మంగి బోడెమ్మ, పోడెల నానిబాబు, పోతల రఘు, ఎంపీటీసీలు పోతుల వెంకటరావు, వంటాకు పైడితల్లమ్మ, గొర్రుపోటు రమాదేవి, గాలి సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలోని వీరనారాయణం, జాలంపల్లి గ్రామాల్లో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. జేడీపేట, ఒమ్మలి, వి.జె.పురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. సహకార సంఘం అధ్యక్షుడు విస్సారపు రామారావు, బొద్దపు భాస్కరరావు, నాయకులు కాళ్లరాజు, పత్రే రామునాయుడు, జేడీపేట సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, జాలంపల్లి సర్పంచ్ దారామల్లేశ్వరి చిన్ని, తాళ్లపురెడ్డి రాంబాబు, పంచాయతీ కన్వీనర్ బొబ్బిలి శ్రీను పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా కె.జె.పురంలో పార్టీ నేతలు బుధవారం ప్రచారం చేశారు. తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, నాయకులు ఆడారి కన్నారావు, కాళ్ల జగన్, ఆడారి గణేశ్, ఎం.వి.సత్యనారాయణ, స్కూలు కమిటీ చైర్మన్ భూపతి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కె.కోటపాడు: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి కోరారు. గొండుపాలెంలో బుధవారం ఆమె ఓటర్లను అభ్యర్థించారు. ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, మాజీ వైస్ ఎంపీపీ బండారు మంగపతి, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ పాల్గొన్నారు.

150 మంది రోగులకు నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్ట్ మడ్డు వెంకటరమణ

నర్సీపట్నం: షిర్డీ సేవా సమాజ్, శంకర ఫౌండేషన్ సౌజన్యంతో స్థానిక సాయిబాబా మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని షిర్డీ సాయి సేవా సమాజ్ అధ్యక్షుడు కర్రి రాంగోపాల్ ప్రారంభించారు. 150 మంది రోగులకు ఆప్తాలమిస్ట్ మడ్డు వెంకటరమణ పరీక్షించారు. వీరిలో 40 మందికి శస్త్రచికిత్సలు చేయనున్నట్లు శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది తెలిపారు. మిగిలిన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. షిర్డీ సాయి సేవా సమాజ్ సెక్రటరీ వి.రామచంద్రరాజు, కోశాధికారి లంక ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు పోతుల సత్తిబాబు, సహాయ కార్యదర్శి నంబూరి సత్తిబాబు, కమిటీ సభ్యులు ఎల్ఐసీ వెంకటేశ్వరరావు, కర్రి దుర్గాప్రసాద్, మీసాల సత్యనారాయణ, మంతిన రమణారావు, త్రినాథరావు, కె.శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

మద్యాన్ని నిర్మూలిస్తేనే మహిళలకు మేలు



ర్యాలీ చేస్తున్న మహిళలు

చోడవరం రూరల్: మద్యాన్ని సంపూర్ణంగా నిర్మూలిస్తేనే మహిళలకు విముక్తి కలుగుతుందని స్త్రీ విముక్తి సంఘటన ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ ఓ.వి.వి.ఎస్.లక్ష్మీకుమారి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో బుధవారం చోడవరంలో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లో సమావేశంలో ఆమె మాట్లాడుతూ మార్చి 8వ తేదీ పోరాట స్ఫూర్తితో మద్య నిషేధానికి పోరాడాలని పిలుపు నిచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లా జన సాహితీ అధ్యక్షుడు ఐటీఆర్వీ శివాజీరావు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు విష సంస్కృతిని విచ్చలవిడిగా వ్యాప్తి చేస్తున్నాయని వాపోయారు. జన సాహితీ జిల్లా సభ్యుడు రవిశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వాల పరాధీన విధానాలే ప్రస్తుత సమస్యలన్నిటికీ మూలమన్నారు. గోవాడ భవన నిర్మాణ కార్మికుల సంఘం కార్యదర్శి బియ్యపు దేముడమ్మ, బానయ్య కోనేరు పేద మహిళా సంఘం కార్యదర్శి కె.కల్పన, పార్వతి మాట్లాడారు.

ప్రకృతి వనరుల సేవా కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం స్వామినాయుడు

రావికమతం: దొండపూడిలో ప్రకృతి వనరుల సేవా కేంద్రాన్ని ఆ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజరు ఆర్.వి.ఎస్ స్వామినాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాల సాగు విధానంపై పలు సూచనలు చేశారు. ఎండా కాలంలో భూమిని బీడుగా ఉంచకుండా పీఎండీఎస్ వేసి సారవంతం చేసుకోవాలన్నారు. 30 రకాల విత్తనాలతో 12 కేజీల మొత్తాన్ని ఎకరా భూమిలో వేసుకోవాలన్నారు. విత్తన గుళికలు, బీజామృతం, జల్లెడపట్టిన ఎర్రమట్టి, జల్లించిన కర్రబూడిద తయారీ గురించి వివరించారు. మాజీ సర్పంచ్ గర్రెడ్డి తాతబాబు, ఉప సర్పంచ్ రాజారావు, నాయకులు రామునాయుడు, రాము పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదానం శిబిరాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారి పద్మప్రియ

నాతవరం: రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడిన వారవుతారని గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి వి.పద్మప్రియ తెలిపారు. ఎం.బి.పట్నం హెచ్‌పీసీఎల్ అసిస్టెంటు మేనేజరు బిందుసాయిరామ్ ఆధ్వర్యంలో బుధవారం గునుపూడి పీహెచ్‌సీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్నివైద్యాధికారి వి.పద్మప్రియ ప్రారంభించి మాట్లాడారు. అన్ని దానాల కంటే రక్తదానం మిన్నదన్నారు. 30 మంది రక్తదానం చేయగా, 30 యూనిట్లు రక్తం సేకరించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా వైద్యాధికారి పద్మప్రియ ఆశ కార్యకర్తలను హెచ్‌పీసీఎల్ అసిస్టెంటు మేనేజరు బిందు సాయిరామ్, హెల్త్ సూపర్‌వైజరు నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంటు జయకుమార్ ఘనంగా సత్కరించారు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా హోలీ



రంగులు పూస్తున్న చిన్నారులు

రోలుగుంట: మండలంలో హోలీ పండగను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోలుగుంట వీధుల్లో చిన్నారులు తిరుగుతూ వారి స్నేహితులపై రంగులు చల్లుతూ సందడి చేశారు. దీనిలో భాగంగా ఇక్కడ వేర్వేరు గ్రామాల్లో జీవనోపాధి సాగిస్తున్న మార్వాడీలు ఒకరి ఇళ్లకు ఒకరు వచ్చి ఆత్మీయంగా పలకరించుకుని హోలీ సంబరాలు చేసుకున్నారు.

కె.కోటపాడు: మండలంలో హోలీ వేడుక ఉత్సాహంగా జరిగింది. యువకులు, చిన్నారులు తమ తోటి స్నేహితులకు రంగులను పూసి కేరింతలతో మునిగారు. పాతవలస, ఎ.కోడూరు, కె.కోటపాడు, ఆనందపురం, కొరువాడ, చౌడువాడ గ్రామాల్లో యువకులు ఆనందోత్సాహాలతో హోలీ నిర్వహించుకున్నారు.

అంగరంగ వైభవంగా పెద్దింటమ్మ ఉత్సవాలు



80 అడుగుల వెదురు జెండాను ఆవిష్కరిస్తున్న భక్తులు

రోలుగుంట: కుసుర్లపూడిలో ఈ నెల 3న ప్రారంభమైన పెద్దింటమ్మ ఉత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంతోపాటు వీధుల్లో కన్నుల మిరిమిట్లు గొలిపే విధంగా విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. నాగదేవత, వేంకటేశ్వరస్వామి పద్మావతి, శివపార్వతులు తదితర దేవతామూర్తుల విద్యుద్దీపాల ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. చివరి రోజు వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. 80 అడుగుల నిడివి వెదురుకు అమ్మవారి జెండాను కట్టి ప్రత్యేక పూజలతో భక్తులు భుజాలపై మోసుకుని వచ్చి ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. ఈ జెండా వెదురును పట్టుకుంటే తమ కోర్కెలు తీరుతాయని నమ్మకంతో దాన్ని పట్టుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ బందబోస్తు ఏర్పాట్లు చేశారు.

నేడు రెండు గ్రామాల్లో పండగలు

మాకవరపాలెం: మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం గ్రామదేవతల పండగలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శెట్టిపాలెంలో బోడకొండమ్మతల్లి, బయ్యవరంలో మావుళ్లమ్మతల్లి పండగలను వైభవంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా భారీ ఎత్తున జరుపుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్సాహంగా వాలీబాల్ టోర్నీ

కోటవురట్ల : కైలాస పట్నంలో నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా మండల స్థాయి వాలీబాల్ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో తలపడ్డారు. ఈ టోర్నీని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు తిలకించారు.